# పోనీ పోనీ పోతే పోనీ

బులుసు సాయిరాం



గడియారం తొమ్మిది గంటలు కొట్టినా కూతురు ఇంటికి రాలేదేవిటా అని ఆత్రంగా ముందర గదిలోనే అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు ఆ ముద్దుల కూతురు తల్లిగారు. అయిదింటికి ఆఫీసు వదిల్తే అయిదున్నర లేక ఆరుగంటలకల్లా ఇంటికి చేరుకునే కూతురు ఈ మధ్య తరచూ ఎనిమిది ఎనిమిదిన్నర, ఒకప్పుడు తొమ్మిదయితేనేగాని ఇల్లు చేరట్లేదు. ఎందుకో కారణం వూహించలేక పోతున్నారు పాపమా తల్లిగారు. గట్టిగా నిలదీసి అడగలేరు. ఒకవేళ అడిగినా ఏదో సాకు చెప్తుంది. అది నమ్మదగినట్లుగా లేక పోయినా పైకి సరే అంటారు. అంతకన్నా ఏం చేస్తారు? చెవులు మెలేసో, పిక్కపాశం పెట్టో, నాలుగు దెబ్బలేసో నిజం చెప్పించటానికి చిన్నపిల్ల కాదుగా? ఆరేళ్ళ క్రితమే మైనారిటీ తీరిన బాల. మరియు నెలకు ఆరు వందలు సంపాదించుచున్న యువతి. ఇవాళేమైనా సరే నిలదీసి అడగాలనుకుందేగాని. అదసలే నోరు కల మనిషి. పుసిక్కున ఏమైనా మాటంటే?

ఆఫీసులో చాకిరీ చేస్చేసి విసిగి వేసారి పోయి ఇంటికి వస్తే ఇంట్లో కూడా మన శాంతి లేకుండా చేస్తున్నావంటే?

నలుగురితో కలిసి పనిచేసేవాళ్ళం, సరదాగా ఎక్కడికైనా ఏ సినిమాకో, షికారుకో వెళ్తాం దానికింత ఆరాలెందుకంటే?

అమ్మో! నోటికి హద్దు పద్దు లేదు. చిన్నంతరం పెద్దంతరం లేదు. ఏమైనా కుర్రకారే. ఆయన పోయిన దగ్గర్నించి గుట్టుగా ఏ మాటా అనిపించుకోకుండా నెట్టుకొస్తున్నాను. పోనీ అదెలా పోతే నాకెందుకు? ఏదో అది తెచ్చిన నాలుగు రాళ్ళు ఉడకేసి దానికంత పెట్టి నేనింత తిని కృష్ణా రామా అని కూర్చోక నాకింకో తాపత్రయమెందుకు? బాగైనా పాడైపోయినా దాని భవిష్యత్తు దాని జీవితమేగా. పోనీ పోనీ పోతే పోనీ....

ఇలా పరిపరివిధాల పోతున్న మనసును అదుపులోకి తెచ్చుకోలేక సతమతమవుతున్న ఆ ముద్దుల కూతురు తల్లిగారు "టంగ్"మని కాలింగ్ బెల్ మోగడంతో తన ఆలోచనలకు స్వస్తి చెప్పి తలుపుతీసి మౌనంగా వంటింట్లోకి దారి తీశారు. ఆలస్యం అయినందుకు కారణం చెప్పబోతుంటే-

"ఇప్పుడు నిన్ను కారణం ఎవరడిగారు?"

"అహా! ఎవరడిగారని కాదు. ఆలస్యం అయింది కదా, నా కోసం నువ్వు గాభరాపడి వుంటావనుకుని...."

"అబ్బ! ఎంత ప్రేమే నేనంటే నీకు. ఆలస్యమయితే గాభరా పడతాననుకునే దానివి, 'ఇవాళ ఆలస్యంగా వస్తాను. నాకోసం చూడకు.' అని వెళ్ళేటప్పుడే చెప్పి వెళ్ళచ్చుగా? పోనీ సాయంత్రం ఇంటికోసారొచ్చి చెప్పి వెళ్ళచ్చుగా? పోనీ నీకు రావడానికి తీరుబడిలేదు; ఆఫీసులో కుర్రాడితోనైనా చెప్పి పంపించచ్చుగా? అసలు నీకు ఇంట్లో ఓ మనిషుంది.... అది మనకోసం కాచుకునుంటుంది అన్న ధ్యాస వుంటేగా? అదే ఆయనైతే........"

"ఇదుగో నిన్నే ఆ అనవసరపు మాటలే మాటాడవద్దంది. ఎందులోంచి ఎందులో కొచ్చావు."

"అనవే అను. బాగా అను. నేను నీకేం చెప్పినా అనవసరంఅనలు నేనే నీకు అనవసరం."

* * *

మర్నాడు ఆదివారం అవడంమూలాన కాస్త ఆలస్యంగా లేచి కాలకృత్యం తీర్చుకుని చెప్పుల్లో కాళ్ళు పెడుతున్న కూతుర్ని చూసి ఎక్కడికి వెళుతున్నావని అడిగారు తల్లిగారు. రాత్రి ఘర్షణ తాలూకు కోపం ఇంకా మిగిలి వుండడంతో సమాధానం చెప్పకుండా హ్యాండ్ బాగ్ వూపుకుంటూ విసావిసా నడచి వెళ్ళిపోయారు కూతురుగారు.

* * *

మరో అయిదు సంవత్సరాలు గడిచాయి. ఎవరి ప్రవర్తనలో మార్పు లేకుండా!

* * *

ఓ ఆదివారం.

పక్కింటి పిన్నిగారితో హరికథా కాలక్షేపానికెళ్ళొచ్చి "కాలింగ్ బెల్" నొక్కబోయి ఆగిపోయాయి.... ఆవిడ చేతులు లోపలినించి ఆడ, మగ గొంతుకలు వినిపించాయి. ఆడ గొంతుక గుర్తుపట్టింది. కూతురిది. మరి మొగ్గొంతు? ఏమో తనకి తెలీదు? మధ్యలో నవ్వులు. విరగపడి నవ్వుతోంది కూతురు-అతగాడు ఏం అన్నాడోగాని మరి. మెట్లమీద చతికిలబడింది. ఆవిడకి ఏం చేయాలో తోచలేదు. పోనీ అతగాడు వెళ్ళేంతవరకూ పక్కింటి పిన్నిగారింట్లో కూచుందామా అంటే-"సీ కూతురింకా ఇల్లు చేర్లా?" అని ఆవిడ ఆరా తీస్తే ఏం సమాధానం చెప్పాలి? ఇప్పుడేం దారి? ముఖాన్ని అరచేతుల్లో దాచుకుంది. నాలుక పిడచకట్టుకుపోయింది. పెదాలు తడారిపోయాయి. గాలి వేడిగా కోపంగా కొడ్తోంది. ఆవిడ పవిటచెంగును చెవులు మీదుగా మొహం అంతా కప్పేసుకుంది. అంతే. ఆవిడెప్పుడైతే చీరకొంగుతో ముసుగులా మొహం అంతా కప్పేసుకుందో అప్పుడు మెరుపు మెరిసింది. ఉరుము ఉరిమింది. వానకురిసింది. ఆవిడకి అద్భుతమైన అయిడియా తట్టింది.


* * *

ఆవిడిప్పుడు తన కూతురు ఎవరో పరాయి మగాడితో నిస్సంకోచంగా, నిర్భయంగా నిర్లజ్జగా కులుకుతుంటే కర్తవ్యం తోచక వీధి గుమ్మం కాయట్లేదు. పొలం చేసుకుంటున్న భర్తగారికి భోజనం తీసుకువెళ్తోంది. చంకలో కూతురు. మెళ్ళో మంగళసూత్రాలతో ఆడుకుంటోంది. ఉన్నట్టుండి ఆవిడ నడవడం మానేసి, కుడిచేతిలోని క్యారేజిని కిందపెట్టి తనలాగే తుళ్ళి తుళ్ళి పడుతున్న పవిట కొంగును కూతురు తలమీదుగా, తన తల మీదుగా ముసుగేసేసి పవిట కొంగు కొసను నోటితో కరిచిపట్టుకుని, కింద పెట్టిన క్యారేజిని యధాప్రకారంగా కుడి చేతిలోకి తీసుకుని, తలకాయ భూమిలోకి వంచేస్కుని దాదాపు పరుగులాటి నడక లంకించుకుంది. ఎవరో ఇద్దరు ఓగడ్డివామిచాటున ఒకర్నొకరు రక్కుకుంటూ పీక్కుంటూ, ఫెడీల్ ఫెడీల్మని ముద్దుపెట్టేసుకుంటూ మహాఆత్రంగా సరసాలాడేసుకుంటున్నారు. ఆవిడ్ని చూడగానే సిగ్గుపడిపోయి గాభరాగా విడిపోయారు. ఆవిడ అలా దాటిందో లేదో మళ్ళీ విజృంభించారు. ఇలాటివే ఎన్నో మరెన్నో నిత్యం దార్లో.

* * *

గతంలోంచి వాస్తవంలోకి ప్రవేశించేశారావిడ. ఒక్క ఉదుటున లేచి తలుపులు దబదబ బాదారు. పవిట కొంగును తల మీదుగా మొహం అంతా కప్పేసుకుని కొసని నోటికి కరచి పట్టుకుని, తలకాయని భూమిలోకి వంచేసుకుని, మళ్ళీ తలుపులు దబదబ బాదారు.

కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి. ఒక్క అంగలో ఆవిడ వంటింట్లోకి దూకి తలుపులు గట్టిగా బిడాయించేస్కుని గట్టిగా గాలి పీల్చుకున్నారు.





# తలలు రెండూ కలిసినప్పుడు పేలకు లభిస్తుంది కొత్త నివాసం

స్కూలు గాని, ఇల్లు గాని, థియేటరు గాని కావచ్చు పేలు వ్యాపించడానికి ఇదే అవకాశం.

లైసిల్‌లో ఆల్కహాల్ లేదు.
ఇతర పేల మందులవలె లైసిల్ ఇగిరిపోదు. ఇది మీ తల, జుట్టులో ఉండే తేమను, పోషణనిచ్చే ముఖ్యమైన నూనెలను లాగేసి జుట్టు పొడిగా, బిరుసుగా తయారయేలా చేయదు. చుండ్రు పట్టనివ్వదు.
లైసిల్ ఆయుర్వేద పద్ధతిలో రూపొందించిన నూనెలు గలది
సువాసననిచ్చే లైసిల్ పేలనూ, ఈళ్ళనూ చంపివేసే పనేగాక తలకు, జుట్టుకూ పోషణను సమకూర్చి చుండ్రు పెరగకుండా చేస్తుంది.
ఎందరెందరో డాక్టర్లు లైసిల్ వాడమని సలహా ఇస్తారు.

సత్వరం సురక్షితం ఫలప్రదం




మెడిసిల్ కెమో ఇండస్ట్రీస్
గణేష్ నగర్, చించ్‌వాడ్, పూనా-411 033

సుగంధిత పేల సంహారిణి

Expresso/SCI/80/TL

రాణీ సుమిత్రాదేవి
"ప్రేమకావ్యం" నవల

అధిక సంఖ్యాక పాఠకులు నటీనటులను యీ క్రింది విధంగా ఎన్నుకున్నారు.

మధు-నాగేశ్వరరావు; సువర్ణ-శ్రీదేవి; మధురవాణి-జయసుధ; శశిభూషణం-సత్యనారాయణ; శంభులింగయ్య-రావు గోపాలరావు.

విజేతలు : 1) పి. వి. ఎస్. కె రావు, కాకినాడ (కూపన్ నెం. 928); 2) ఎమ్. వి. రమణ, నెల్లూరు-(కూపన్ నెం. 721); 3) ఎన్. పి. చంద్రరావు, విస్సన్నపేట(కూపన్ నెం. 1764) బహుమతి మొత్తం ముగ్గురికీ సమంగాపంచబడింది.

"ప్రేమకావ్యం" నవలను చదివి స్పందించిన అసంఖ్యాక పాఠకులు తమ అమూల్యమయిన అభిప్రాయాలను మాకు వ్రాసినారు. అందులో ఈ క్రింది ఆపుగురి లేఖలు ఉత్తమ సాహితీ విలువలు నిండినవిగా ఎన్నికచేసి, వారికి పుస్తకాల రూపంలో బహుమతులు యిచ్చినాము.

1) కె. ఆనందరావు, కాకినాడ; 2) డి. ఎస్. రామచంద్రరావు, గుంటూరు; 3) ఇ. టి రామారావు, శ్రీహరికోట; 4) పి గంగాధర్, జగిత్యాల; 5) బి. శివప్రసాద్, అనకాపల్లి. (6)

లక్ష్మీ పబ్లికేషన్స్,
రామమందిరం వీధి, విజయవాడ-2

"ప్రేమకావ్యం" నవలను ఆదరించిన పాఠకులను మనసారా అభినందిస్తున్నాము.